# కృష్ణా జలాల జగడం

## కొన్ని వాస్తవాలు, కొన్ని సూచనలు

**కృష్ణానదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు దానిని భిన్న ప్రాజెక్టుల మధ్య ఏ ప్రాధాన్యతల ఆధారంగా పంచాలో నిర్ధారించే నియమావళిని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలనీ, ఆ నియమావళి అందరి అవసరాలనూ లెక్కలోకి తీసుకుంటూ, కరువు ప్రాంతాల ప్రాజెక్టుల అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉండాలనీ, ఈ సమస్య ఎప్పుడొచ్చినా ప్రభుత్వం ఏ ఒత్తిడులకూ లొంగకుండా ఈ నియమావళి ప్రకారం నడుచుకోవాలనీ, అందుకోసం ఒక స్వతంత్రమైన రెగ్యులేటరీ కమిషన్‌ను నెలకొల్పాలనీ డిమాండ్ చేయడం అవసరం. ఆ డిమాండ్‌ను సాధించుకోవడం అవసరం.**

కృష్ణా నది నీటి గురించి కొంత కాలంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోనూ జరుగుతున్న ఆందోళనలను చూస్తున్నాం. ఎవరికి వారు మా ప్రాంతానికి నీళ్లు మొదట ఇవ్వాలని అడుగుతున్నారని అర్థమవుతున్నదే తప్ప ఇందులో న్యాయా న్యాయాలు అర్థం చేసుకోవడానికి కావలసిన సమాచారం ప్రజల దగ్గర లేదు, పత్రికలు ఇవ్వడంలేదు.

ఒకటి మాత్రం స్పష్టం అయ్యే ఉండాలి. కృష్ణా నదిలో మామూలుగా వచ్చేదానికంటె ఈ సంవత్సరం తక్కువ నీళ్లు వచ్చాయి కాబట్టి వచ్చిన నీటిని ఎవరికి ముందు ఇవ్వాలి – లేదా దానిని పంచడంలో ఎవరి అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి – అన్న తగవు వచ్చిందని అర్థం అయ్యే ఉండాలి. ఇది ఎప్పుడయినా వచ్చి ఉండగల సమస్యే కాబట్టి దీని పరిష్కారానికి ఒక నియమం ఏదీ ఇన్నాళ్లూ ఎందుకు ఏర్పరచుకోలేదు అన్న సందేహం కూడా వచ్చే ఉండాలి.

**ఒకే పార్టీ నాయకులు నంద్యాలలో ఒక డిమాండుతో, మిర్యాలగూడెంలో ఇంకొక డిమాండుతో, మచిలీపట్నంలో వేరొక డిమాండుతో ఆందోళన చేపట్టారు. ఈ మూడు నాల్కల వైఖరికి ఏ పార్టీ మినహాయింపు కాదు.**

కిందటి సంవత్సరం దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఉన్న సంగతి తెలిసిందే. అందువల్ల అన్ని ప్రాజెక్టులలోనూ నీటిమట్టం బాగా అడుగంటింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుండయితే కనీస నీటి నిలువ మట్టాన్ని దాటి నీటిని దిగువకు మన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దానికి తోడు ఈ సంవత్సరం కూడా కృష్ణా నదికి ప్రధానంగా నీళ్లు అందిచ్చే పడమటి కనుమలలో మళ్లీ వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. మన రాష్ట్రంలో (మొత్తంమీద) సగటు వర్షపాతం ఉన్నప్పటికీ కృష్ణానదిలో నీళ్లెక్కువ లేకపోవడానికి కారణం ఆ నదిలోకి నీటిని పారించే 'కాచ్‌మెంట్' ప్రధానంగా కర్నాటక, మహారాష్ట్రలలో ఉండడం, అక్కడ ఈ సంవత్సరం కూడా వర్షాభావ పరిస్థితులు ఉండడం.

కృష్ణానది మీద (దాని ఉపనదులైన కొయ్‌నా, తుంగభద్ర, భీమ, ఘటప్రభ, మూసి మొదలైన నదులను కలుపుకొని) మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లు మూడింటి లోనూ ప్రాజెక్టులున్నాయి. ఈ మూడు రాష్ట్రాలూ ఎంతెంత నీళ్లు ఆ నది నుంచి తీసుకోవచ్చునో చెప్పే బచావత్ అవార్డు ఉంది.

బచావత్ అవార్డు కృష్ణానదిలో నాలుగింట మూడు సంవత్సరాలు (అంటే 75 శాతం భరోసాతో) 2060 టిఎంసిల నీరు ఉంటుందని అంచనా వేసి, అందులో 800ల టిఎంసిల పైన ఆంధ్రప్రదేశ్‌కు హక్కు ఇచ్చింది. (695 టిఎంసిల పైన కర్నాటకకు, 565 టిఎంసిల పైన మహారాష్ట్రకు ఇచ్చింది). అంతేకాక, ప్రాజెక్టుల నుంచి పొలాలకు పారించే నీటిలో కొంత భాగం తిరిగి నదిలోకి పోతుందని అంచనా వేసి ఆ లెక్క కింద ఆంధ్రప్రదేశ్‌కు మరొక 11 టిఎంసిల నీటిపైన హక్కు ఇచ్చింది. అంటే ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 811 టిఎంసిల నీటిపైన హక్కు ఉంది.

టిఎంసి అంటే ఎంతో తెలుసుకోకపోతే ఈ అంకెలూ సంఖ్యలూ అర్థంకావు కాబట్టి ఒక టిఎంసి అంటే వంద కోట్ల ఘనపుటడుగులు అని చెప్పుకోవాలి. వందకోట్ల ఘనపుటడుగుల నీటిని ఊహించుకోలేము కాబట్టి దానిని అర్థం చేసుకోవ డానికి ఒక వివరణ ఇవ్వడం ఉచితంగా ఉంటుంది. మనం ఏ ప్రాంతం వారిమయినా చెరువులను చూసే ఉంటాము. ఒక టిఎంసిలో మూడవ వంతు నీటి నిలువ సామర్థ్యం ఉండే చెరువు మామూలుగా పెద్దచెరువుగా భావించబడుతుందని చెప్పుకుంటే ఒక అంచనా వస్తుందనుకుంటాము.

ఒక టిఎంసి నీటితో ఎంత పొలం సాగు అవుతుందో తెలుసుకోవడం కూడా ఈ సందర్భంలో ఉపయోగపడుతుంది. ఒక టిఎంసి నీటిని మాగాణి (తరి) సాగుకు వాడేటట్టయితే 6,000 ఎకరాలకు, ఆరుతడి (ఇరిగేటెడ్–డ్రై) పంటకు పెట్టేటట్టయితే 10,000 ఎకరాలకు సరిపోతుందని అంచనా. ఇతర నీటి వనరులతో కలుపుకొని పొదుపుగా వాడుకునేటట్టయితే ఇంకా ఎక్కువ భూమికి పారించుకోవచ్చునని వేరే చెప్పనవసరం లేదు.

ఇప్పుడు మన రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యను తిరిగి ప్రస్తావిద్దాం. నాలుగింట మూడు సంవత్సరాలు నదిలో 2060 టిఎంసిల నీరు ఉంటుందని అంచనా వేసి మూడు రాష్ట్రాలకూ పైన చెప్పిన పద్ధతిలో బచావత్ అవార్డు పంచిందని చెప్పుకున్నాము. ఆ 2060 టిఎంసిల మేరకూ ప్రాజెక్టులు కట్టేసుకున్న తరువాత ఏ సంవత్సరమైనా నదిలో అంతకంటె తక్కువ నీళ్లు వస్తే ఏమవుతుంది? నాలుగింట ఒక సంవత్సరం అది జరిగే అవకాశం ఉందని బచావత్ అవార్డే అంటుంది కాబట్టి ఇది వేసుకోనక్కరలేని ప్రశ్న కాదు.

బచావత్ అవార్డు మూడు రాష్ట్రాల మధ్య నది నీటిని పంపిణీ చేసే తీర్పే తప్ప రాష్ట్రం లోపలి విషయాలతో దానికి ప్రమేయం లేదు. రాష్ట్రాల మధ్య ఏం జరుగుతుందంటే ఎగువ రాష్ట్రం తన అవసరాల మేరకు తన ప్రాజెక్టులలో నీళ్లు నిలుపుకున్న తరువాతే దిగువకు నీళ్లు పంపుతుంది.

మరి రాష్ట్రం లోపల ఏం జరుగుతుంది? బచావత్ అవార్డులో దానికి జవాబు లేదు. ఒక రాష్ట్రానికి కేటాయించిన నీటి వాటాను ఆ రాష్ట్రం తన సరిహద్దుల లోపల ఏవిధంగా పంచుకుంటుందనే విషయంలో దానికే స్వేచ్ఛ ఉంటుందని బచావత్ అవార్డు అంటుంది. ఆల్మట్టి కేసులో ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు ధృవీకరించింది.

స్వేచ్ఛ ఉన్న చోట బాధ్యత కూడ ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు. నీళ్లు తక్కువ వచ్చిన సంవత్సరం రాష్ట్రంలోని ప్రాజెక్టుల మధ్య దానిని ఏవిధంగా పంచాలి? పై ప్రాజెక్టు తన అవసరాల మేరకు నిలుపుకున్న తరువాతే కిందికి పంపించాలా? లేకపోతే వచ్చిన నీటిని వచ్చినట్టు ఒక నిర్దిష్ట నిష్పత్తిలో అన్ని ప్రాజెక్టులకూ పంచాలా? రెండవదే జవాబయితే ఏ నిష్పత్తిలో పంచాలి? ఆయా ప్రాజెక్టుల సామర్థ్యం నిష్పత్తిలో పంచాలా? లేకపోతే కరువు ప్రాంతాలకు కొంచెం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే పద్ధతిలో నిష్పత్తిని నిర్ణయించాలా?

దీనికి అధికారికంగా ఏ జవాబూ లేదు. ఇన్నేళ్లలో ఈ ప్రశ్నలకు జవాబు చెప్పే ఒక విధానం గానీ, ఒక ఆనవాయితీ గానీ – చట్టం సంగతి సరేసరి – మన రాష్ట్ర పాలకులు రూపొందించలేదు. గడచిన నెల రోజులుగా మచిలీపట్నం నుంచి మిర్యాల గూడెం దాకా, మిర్యాలగూడెం నుంచి నంద్యాల దాకా ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టిన రాజకీయ పార్టీలు దీని గురించి ప్రభుత్వాన్ని అడగవలసింది. కానీ ఈ పాపంలో అందరికీ భాగం ఉంది కాబట్టి అడగకుండా జాగ్రత్తపడ్డారు. ఒకే పార్టీ నాయకులు నంద్యాలలో ఒక డిమాండుతో, మిర్యాలగూడెంలో ఇంకొక డిమాండుతో, మచిలీపట్నంలో వేరొక డిమాండుతో ఆందోళన చేపట్టారు. ఈ మూడు నాల్కల వైఖరికి ఏ పార్టీ మినహాయింపు కాదు.

ఏ నియమమూ లేకపోయినా ఇటువంటి సంక్షోభం ఇన్నాళ్లూ తలెత్తకపోవడానికి కారణం కర్నాటక తన వాటా నీటిమేరకు ప్రాజెక్టులు కట్టుకోవడానికి తొందరపడకపోవడం. 1990ల మధ్యభాగం దాకా కర్నాటక తన నీటి హక్కుల విషయంలో తాత్సారం చేస్తూ ఉండింది. (ఇది ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ అసమానతలతో ముడిపడి ఉన్న విషయం). అంతేకాక మన రాష్ట్రం వాటాలో కొత్తగా మంజూరయిన జూరాల, శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టులు నత్తనడక నడుస్తూ ఉన్నాయి. అందువల్ల బెజవాడ దగ్గర కృష్ణా డెల్టాకు కేటాయించిన నీటి వాటా కంటె సగటున 400 టిఎంసిలు ఎక్కువ నీరు మూడేళ్ల కిందటి వరకు కృష్ణా నదిలో లభ్యమయ్యేవి. తీవ్ర వర్షాభావ సంవత్సరాలలో సహితం కృష్ణా డెల్టాకు తన వాటాకంటే 100 టిఎంసిలకు తక్కువ కాకుండా అదనపు నీరు లభించేది. ఆల్మట్టి పూర్తయిన తరువాతే తన వాటాకు కొంచెం ఇటూ అటూగా మాత్రమే నీళ్లు లభించే సగటు స్థితి డెల్టాకు వచ్చింది. ఈ సంవత్సరం నెలకొన్న అసాధారణ పరిస్థితులలో అందరిలాగా వారికి కూడా సాగునీటికి కటకట అయింది.

ఏ నియమమూ లేకపోతే ఏమవుతుందంటే బలవంతుల ఆటలే సాగుతాయి. ఒక నెల రోజులుగా రాష్ట్రంలో ఇదే చూస్తున్నాం. 'ఏమయినా సరే డెల్టా భూములను కాపాడుతాం' అని ముఖ్యమంత్రి పదే పదే ప్రకటిస్తున్నాడు. డెల్టా రైతులు కూడా రైతులే, వారికీ ప్రభుత్వం చేయూత ఇయ్యవలసిందే గానీ వారు మాత్రమే రైతులా? ఎగువ ప్రాంతం వ్యవసాయాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రభుత్వం అందరినీ కాపాడవలసిందే, నీటి వనరులయినా ఏ వనరులయినా అందరికీ తగు మోతాదులో అందియ్యవలసిందే. కానీ అది నియమబద్ధంగా ఉండాలి, ఆ నియమం న్యాయంగా ఉండాలి, ఆ న్యాయానికి ఒక ఉచితమైన ప్రమాణం ఉండాలి. వీటి దాఖలాలేవైనా ఈ నెల రోజులలో కనిపించాయా?

**ఏ నియమమూ లేకపోతే ఏమవుతుందంటే బలవంతుల ఆటలే సాగుతాయి. ఒక నెల రోజులుగా రాష్ట్రంలో ఇదే చూస్తున్నాం. 'ఏమయినా సరే డెల్టా భూములను కాపాడుతాం' అని ముఖ్యమంత్రి పదే పదే ప్రకటిస్తున్నాడు. డెల్టా రైతులు కూడా రైతులే, వారికీ ప్రభుత్వం చేయూత ఇయ్యవలసిందే గానీ వారు మాత్రమే రైతులా? ఎగువ ప్రాంతం వ్యవసాయాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానికి లేదా?**

కడప, కర్నూలు జిల్లాలకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఒక చుక్క నీరు ఇయ్యాలన్నా శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగులు ఉండాలి. ఆ జిల్లాల ఆయకట్టు దార్ల అవసరాలు పూర్తిగా తీర్చడానికి కాదు, ఒక చుక్క నీరియ్యాలన్నా శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం 854 అడుగులు ఉండక తప్పదు. పోతిరెడ్డిపాడు 'టేక్–

వర్షపాతం, భూగర్భ జలాలు ఎక్కువ ఉన్న ప్రాంతానికి ఎక్కువ నది నీరు, తక్కువ ఉన్న ప్రాంతాలకు తక్కువ నది నీరు కేటాయించడం అన్నిటికంటె ప్రాథమికమైన అన్యాయం.

ఆఫ్' లెవలే అంత. ఆ జిల్లాల వాళ్లు ఆ మాట అంటే ముఖ్యమంత్రి సెప్టెంబర్ 15 దాకా శ్రీశైలం నుంచి నీళ్లు కిందికి వదలబోమని హామీయిచ్చాడు. సెప్టెంబర్ 15 నాటికి నీటిమట్టం 854 అడుగులు చేరుకోకపోతే ఏం చేస్తారో మాత్రం చెప్పలేదు.

ఇది సెప్టెంబర్ మొదటి దినాలలో. అయితే ఒక వారం తిరగకముందే ముఖ్యమంత్రి కృష్ణా జిల్లాకు పోయి వెంటనే శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీళ్లు కిందికి విడిచిపెడతామని హామీ ఇచ్చాడు. ఈ హామీ వెంటనే అమలయింది కూడా. (అయినప్పటికీ వారి అవసరా లకు చాలినంత రాలేదనీ, ఇంకా విడిచిపెట్టమనీ డెల్టా నాయకులు ఆందోళన కొనసాగించారు – అది వేరే సంగతి).

శ్రీశైలం నుంచి కిందికి ప్రవహించే కృష్ణానది నీళ్లు నేరుగా బెజవాడకు పోవు. మధ్యలో నాగార్జునసాగర్ ఉంది. దానికి కుడి, ఎడమ కాలువలున్నాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీళ్లిచ్చే కుడికాలువకు కొంచెం దిగువనుండే నీళ్లు అందుతాయిగానీ సాగర్‌లో నీటిమట్టం 510 అడుగులుంటే తప్ప నల్లగొండకూ, ఖమ్మంకూ (కొంచెం కృష్ణా జిల్లా మెట్ట తాలూకాలకు కూడా) నీళ్లిచ్చే ఎడమ కాలువకు నీళ్లందవు. ఆపైన కూడా నీళ్లుంటే తప్ప ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండకు వరమంటూ ఆర్భాటంగా ప్రకటించిన ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ కోసం నీళ్లు ఎత్తిపోసి నిలువ ఉంచే అక్కంపల్లి రిజర్వాయర్ కనీసం తడవదు. ముఖ్యమంత్రి కృష్ణా జలాల వివాదం గురించి చేసిన ప్రకటనలలో ఈ అవసరాల ప్రస్తావన సహితం లేదు.

ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుంటే తప్ప రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో నెల రోజులుగా సాగుతున్న ఆందోళనలను అర్థం చేసుకోలేం. అర్థం చేసుకోకపోతే అన్ని ఆందోళనలనూ ఒకేగాటన కట్టి నిందించడమో, అభినందించడమో జరుగుతుంది. అది అవాంఛనీయం.

కృష్ణా నదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు దానిని భిన్న ప్రాజెక్టుల మధ్య ఏ ప్రాధాన్యతల ఆధారంగా పంచాలో నిర్ధారించే నియమావళిని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలనీ, ఆ నియమావళి అందరి అవసరాలనూ లెక్కలోకి తీసుకుంటూ, కరువు ప్రాంతాల ప్రాజెక్టుల అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉండాలనీ, ఈ సమస్య ఎప్పుడొచ్చినా ప్రభుత్వం ఏ ఒత్తిడులకూ లొంగకుండా ఈ నియమావళి ప్రకారం నడుచుకోవాలనీ, అందుకోసం ఒక స్వతంత్రమైన రెగ్యులేటరీ కమిషన్‌ను నెలకొల్పాలనీ డిమాండ్ చేయడం అవసరం. ఆ డిమాండ్‌ను సాధించుకోవడం అవసరం.

అయితే కృష్ణా జలాలకు సంబంధించిన అసలు సమస్య ఇది కాదు. మన రాష్ట్రంలో భిన్న ప్రాంతాల మధ్య ఆ నది నీటిలో మన వాటాగా వచ్చిన 800 (లేక 811) టిఎంసిల నీటిని పంపిణీ చేసిన విధానమే అన్యాయమైనది. కోస్తా ఆంధ్రకు 377 టిఎంసిలు, తెలంగాణకు 267 టిఎంసిలు, రాయలసీమకు 123 టిఎంసిలు పంపిణీ చేశారు. తెలంగాణకు ఇచ్చిన 267 టిఎంసిలలో చెప్పుకోదగ్గ మొత్తం కాయితాల మీద తప్ప ఎక్కడున్నాయో తెలియని మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయించబడ్డాయి.

ఈ పంపిణీ ఏరకంగా చూసినా అన్యాయమైనది. వర్షపాతం, భూగర్భ జలాలు ఎక్కువ ఉన్న ప్రాంతానికి ఎక్కువ నది నీరు, తక్కువ ఉన్న ప్రాంతాలకు తక్కువ నది నీరు కేటాయించడం అన్నిటికంటె ప్రాథమికమైన అన్యాయం. దీనిని ఇప్పటికయినా సవరించి వర్షాభావం, కరువు, పేదరికం అధికంగా ఉన్న తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు నీళ్లిచ్చే పెండింగ్ ప్రాజెక్టులకు నీటిని ఒక హక్కుగా కేటాయించడం ద్వారా కృష్ణానది నీటిని పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించడం అవసరం. అప్పుడుగానీ నీటి హక్కుల విషయంలో న్యాయం జరగదు.

**కృష్ణా నదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం**

9 అక్టోబర్ 2003 *(Movement for Redistribution of Krishna River Waters)*